సాక్షి ఖమ్మం
శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



ఏపీజీవీబీ.. ఇక టీజీబీ

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మరింత విస్తృతమైన సేవలందించనుంది.

8లో



అడ్డంకులు ఏమిటి?

మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎదురయ్యే అడ్డంకుల గుర్తింపునకు అధికారులు పరిశీలన చేపట్టారు.

8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్ర, శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలోని డైట్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత సర్దార్ పటేల్ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తారు. ఇక శనివారం ఉదయం బుగ్గపాడు, కాకర్లపల్లిలో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు కోఆపరేటివ్ సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే, మధ్యాహ్నం 12గంటలకు తల్లాడ మండలం నూతనకల్‌లో కోఆపరేటివ్ సొసైటీ భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నారు.

నేడు 'నిధి ఆప్ కే నికట్'

ఖమ్మంసహకారనగర్: సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు శుక్రవారం 'నిధి ఆప్ కే నికట్' నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రబీలాల్‌దాస్, కె.సునీల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులకు ఆన్‌లైన్ సేవల విధివిధానాలు, కొత్త సంస్థల యజమానులకు పరిచయం, పెన్షనర్ల సమస్యల పరిష్కారం ఉంటుందని వెల్లడించారు. ఖమ్మం జిల్లా వాసుల కోసం ఖమ్మంలోని మమత ఎడ్యుకేషనల్ సొసైటీలో, భద్రాద్రి జిల్లా వాసులకు ఇల్లెందులోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9-15నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఓ

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. నేలకొండపల్లిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించడంతో పాటు చికిత్స కోసం వచ్చిన వారితో సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమై డీసీహెచ్‌ఓ సమయపాలన, వైద్యసేవలపై సూచనలు చేశారు. కాగా, స్థానికులు జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, సోమనబోయిన సాయినవీన్, కడియాల నరేష్ తదితరులు ఆయనకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

తడిసిన ధాన్యంతో తంటాలు



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు కుటుంబం

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యం, అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న జల్లులు వెరసి రైతుల పాలిట శాపంగా మారాయి. నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, మంగాపురంతండా తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోగా గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో తడిసింది. ధాన్యం రాశుల చుట్టూ నీరు చేరడంతో గురువారం పలువురు రైతులు నీరు ఎత్తిపోయడమే ధాన్యాన్ని ఆరబెడుతూ కనిపించారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని త్వరగా కాంటాలు వేయించాలని కోరుతున్నారు.

కూసుమంచి మండలంలోని సాగర్ ఆయకట్టులో వేసిన వరినాట్లు



సాగర్ జలాల పరవళ్లు...

జిల్లాలోని 2.54 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు యాసంగిలో కళకళలాడనుంది. ఓవైపు జలాశయాల్లో పుష్కలంగా ఉన్న నీటికి తోడు సాగర్ జలాలు సైతం విడుదల చేస్తుండడంతో పంటల సాగుకు ఢోకా లేనట్లేనని రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే, అధికారులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచిస్తుండగా మద్దతు ధరకు తోడు బోనస్ అందుతుండడంతో రైతాంగం వరికే ప్రాధాన్యత ఇస్తోంది. కాగా, ఆయకట్టుకు 34 టీఎంసీల నీటిని కేటాయించిన నేపథ్యాన ఈనెల 15నుంచి విడుదలవుతున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 23 వరకు వారబందీ విధానంలో ఇది కొనసాగనుంది.

– ఖమ్మంఅర్బన్

సాఫీగా సాగనున్న యాసంగి సాగు
- వారబందీ విధానంలో ఏప్రిల్ 23 వరకు నీటి విడుదల
- ఆరుతడి పంటల సాగుపై అధికారుల అవగాహన
- జిల్లా రైతాంగం మాత్రం వరి వైపే మొగ్గు

యాసంగి సాగులో నిమగ్నం

ఇప్పటికే ఖరీఫ్‌లో సాగుచేసిన వరి కోతలతో పాటు పత్తి తీత పూర్తికాగా యాసంగి పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని సాగర్ ఆయకట్టు పరిధి 17 మండలాల్లో 2.54 లక్షల ఎకరాలకు ఎక్కువగా వరి సాగుకే సై అంటున్నారు. సాగర్ జలాలతోపాటు చెరువులు, కుంటల్లో నీరు ఉండడం, ఇటీవల కురిసిన వర్షాలతో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న నేపథ్యాన బోర్లు, బావుల కింద కూడా రైతులు వరి సాగుకే ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం దుక్కులు దున్నడం, నారు మడి వేయడం ప్రారంభమవగా, కొన్ని ప్రాంతాల్లో రైతులు నాట్లు కూడా వేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో సన్నరకం వరి పండించిన రైతులకు ప్రభుత్వం మద్దతు ధరకు తోడు బోనస్‌గా రూ.500 చెల్లించింది. దీంతో రబీలోనూ వరిలో సన్నరకాలవైపే మొగ్గు చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అలాగే, ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పెసర, వేరుశనగ వంటి పంటలు కొద్ది మేర సాగవనున్నాయి.

వారబందీలో విధానంలో విడుదల

ఈనెల 15నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల ప్రారంభమైంది. మొదటి విడతగా నీటి విడుదల 27రోజుల పాటు కొనసాగనుంది. ఆ తర్వాత తొమ్మిది రోజులు నిలిపేస్తారు. ఇక రెండో తడి నుంచి తొమ్మిది రోజులు నీరు విడుదల చేస్తూ ఆరు రోజులు నిలిపివేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇలా వచ్చే ఏడాది ఏప్రిల్ 23వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో రైతులు సాగుకు నీటి కొరత రాదనే నమ్మకంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా, సాగర్ జలాల విడుదలతో జిల్లాలోని కాల్వలన్నీ నిండా నీటితో కళకళలాడుతున్నాయి.

వరి సాగు వద్దు..

ఓ పక్క రైతులు సాగు పనుల్లో నిమగ్నం కాగా.. అధికారులు యాసంగిలో వరి పంట వేయొద్దని కోరుతున్నారు. జిల్లాకు వారబందీ విధానంలో



సాగర్ ప్రధాన కాల్వ

నీరు విడుదలవుతున్నందున ఆరుతడి పంటలకు సమృద్ధిగా నీరు అందుతుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అలాకాకుండా ఎక్కువగా వరి సాగు చేస్తే చివరి ఆయకట్టుకు నడి వేసవిలో నీరు అందక ఇక్కట్లు ఎదురవుతాయని అవగాహన కల్పిస్తున్నారు. గతంలోనూ ఇలా జరిగి రైతులు నష్టపోయారని చెబుతున్నారు. కాగా, జిల్లాలోని 17 మండలాల పరిధి 2.54 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టులో సాగు పనులు మొదలవుతున్నందున ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించేలా జలవనరుల శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కానీ రైతులు మాత్రం వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది.

20లక్షల ఇళ్లు కట్టబోతున్నాం..



పెనుబల్లి : మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి తదితరులు

- భూసమస్యల పరిష్కారానికే 'భూభారతి'
- పాలేరుతో సమానంగా సత్తుపల్లి అభివృద్ధి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పెనుబల్లి: తెలంగాణ రాకముందు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 25.35 లక్షల మంది పేదల కోసం ఇళ్లు నిర్మిస్తే, తెలంగాణ వచ్చాక గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ గృహాల పేరుతో రూ.కోట్లు దండుకుందే తప్ప పేదలకు న్యాయం చేయలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెనుబల్లిలో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఆయన కల్లూరు, పెనుబల్లి మండలాల లబ్ధిదారులు 152 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో తాము రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు మంజూరు చేయనున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల మేర అప్పులు భారం మోసినా సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఇక భూములకు సంబంధించి సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం తీసుకొస్తున్నామని చెప్పారు. కాగా, తాను పుట్టిన పెరిగిన సత్తుపల్లి నియోజకవర్గాన్ని పాలేరుతో సమానంగా అభివృద్ధి చేస్తానని మంత్రి ప్రకటించారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని చెప్పారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ నియోజకవర్గానికి 5వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు పెనుబల్లిని నగర పంచాయతీగా చేయాలని కోరారు. ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కల్లూరు మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్లు భాగం నీరజ, రాజబోయిన కోటేశ్వరరావుతో పాటు డాక్టర్ మట్టా దయానంద్, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, బండి వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, బుక్కా కృష్ణవేణి, కోటేశ్వరరావు, కోట్లపల్లి వెంకటేశ్వరరావు, పసుమర్తి విశ్వనాథ్, బాపిరెడ్డి, మాధవరెడ్డి, కమలాకర్‌రావు, మాధవరావు, కిషోర్, నవజీవన్, కాం



కల్లూరు రూరల్ : పాయపూర్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

తయ్య, దామోదర్, కిరణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

తల్లాడ/కల్లూరు: తల్లాడ మండలంలోని అంబేద్కర్ నగర్-పినపాక మధ్య, కల్లూరు మండలం పాయపూర్ నుంచి ముచ్చవరం వరకు నిర్మించే బీటీ రహదారుల పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పీఆర్ ఈఈ రాంకోటిరెడ్డి, డీఈ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, నీరజాదేవి, వైకంఠి శ్రీనివాసరావు, ఊటుకూరు సందీప్, గణేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్, పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్, పాండురంగాపురం, లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ, కొత్తగూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన పనులను ఆయన ప్రారంభిస్తారు. అలాగే, సాయంత్రం 3-30గంటల నుంచి ఖమ్మం కలెక్టరేట్‌లో మున్నేటిపై రిటైనింగ్ వాల్ నిర్మాణంపై అధికారులతో మంత్రి సమీక్షిస్తారు. ఆతర్వాత ఖమ్మం రూరల్ ఎం.వెంకటాయపాలెం, తనగంపాడు, కాచిరాజుగూడెం, ఆరెకోడు తండాల్లో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

ఎరజ్రెండాల ఐక్యతే ప్రత్యామ్నాయం

- కమ్యూనిస్టుల పురోగమనంతోనే అందరికీ రక్ష
- సీపీఐ పోరాటాలతో అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు
- పార్టీ శత వార్షిక సభలో కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టుల పురోగమనం, ఎర్రజెండాల ఐక్యత దేశానికి రక్షగా నిలుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. పాలకుల తీరుతో కమ్యూనిస్టుల ఆవశ్యకతను అంతా గుర్తిస్తున్నందున పురోగమనం తప్పదని ఆయన అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా గురువారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత ధర్నా చౌక్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ర్యాలీ సాగగా, కళాక్షేత్రంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడారు. 99 ఏళ్ల కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ చరిత్రలో అనేక పోరాటాలు, ప్రజా ఉద్యమాలు, త్యాగాలు ఉన్నాయని తెలిపారు. దాదాపు సీపీఐ ఆవిర్భావ సమయంలోనే ఏర్పడిన ఆర్‌ఎస్ఎస్ దేశ విచ్ఛిన్నాన్ని కోరుకుంటే తమ పార్టీ మాత్రం కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారానికి పనిచేసిందన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ సంపన్నవర్గాల కోసమే కృషి చేసిందని చెప్పారు. సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం కూడా కమ్యూనిస్టులదేనని, తమ పోరాటాలతోనే అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు వచ్చాయని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం ప్రజల జీవన గతిని మార్చిందని, ఈ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని కూనంనేని వెల్లడించారు. నాటి నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు కమ్యూనిస్టుల త్యాగాలతో రాష్ట్రం పునీతమైందని తెలిపారు. ఇక కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఖమ్మం జిల్లాకు ప్రత్యేక స్థానముందని ఆయన చెప్పారు. ప్రజల అభ్యున్నతికి త్యాగాలు చేసిన ఇక్కడి నేతలు నల్లమల గిరిప్ర



పైలాన్ వద్ద అరుణ పతాకాన్ని ఎగురవేస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న సాంబశివరావు, వేదికపై పువ్వాడ, హేమంతరావు తదితరులు

సాద్, మహ్మద్ రజబ్ అలీ, దేవూరి శేషగిరిరావు, సర్వదేవభట్ల రామనాథం, మనబోతుల కుమరయ్య సహా వందలాది మందికి వారసులుగా తాము గర్వపడుతున్నామని సాంబశివరావు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో పోరాటాల పురిటి గడ్డగా ఖమ్మం ఖ్యాతి గడించిందని, అమరుల త్యాగాలు ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించాయని వెల్లడించారు. గణేశ్వరం, వినోభానగర్, తోటపల్లి లాంటి చారిత్రక భూపోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నేతృత్వం వహించిందని తెలిపారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా మాట్లాడగా నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నేతలకు సన్మానం

సీపీఐ శత వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా సుదీర్ఘకాలం కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారిని సన్మానించారు. సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు సహా పలువురు సన్మానం అందుకున్నారు. కాగా, ర్యాలీలో జన సేవాదళ్ కార్యకర్తలు వంద మంది అరుణ పతాకాలతో పాల్గొనగా, తొలుత రెడ్‌షర్ట్ వలంటీర్లు, వారి తర్వాత వరుసలో మహిళా బృందాలు కోలాట ప్రదర్శన ఇచ్చాయి. ఇక సీపీఐ జాతీయ ఉపప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నల్లమల గిరిప్రసాద్ విగ్రహం వద్ద జెండాను కూనంనేని ఆవిష్కరించారు.

వైభవంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవంగా జరిగింది. గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశాక బేడా మండపంలో నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేటి నుంచి క్రీడా పండుగ!

- పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ టోర్నీ
- ఉమ్మడి జిల్లాల వారీగా హాజరుకానున్న జట్లు
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడారంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా గ్రామస్థాయి మొదలు రాష్ట్రస్థాయి వరకు ప్రభుత్వం సీఎం కప్ పేరిట క్రీడాపోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహించేందుకు వేదికలు ఖరారు చేయగా ఖమ్మంకు వాలీబాల్, ఆర్చరీ టోర్నీలు కేటాయించారు. ఈమేరకు శుక్రవారం నుంచి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో వాలీబాల్ పోటీల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

పది చొప్పున జట్లు, నాలుగు కోర్టులు

ఏళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వేదికగా నిలుస్తున్న ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ జరగనుంది. ఇందుకోసం జిల్లా యువజన క్రీడల శాఖ, వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నాలుగు కోర్టులను సిద్ధం చేశారు. రాష్ట్రంలోని పాత పది జిల్లాల వారీగా పురుషులు, మహిళల జట్లు కోచ్‌లు, మేనేజర్లు హాజరుకానున్నారు. మ్యాచ్‌లు లీగ్ కం నాకౌట్ విధానంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనూ నిర్వహిస్తామని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

పోటీలు ఉదయం... ప్రారంభం సాయంత్రం

సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ఉదయం నుంచే మొదలవుతాయి. కానీ ప్రారంభ సమావేశాన్ని మాత్రం సాయంత్రం ఏర్పాటుచేశారు. ఉదయమే సభ ఉంటే మ్యాచ్‌ల నిర్వహణకు ఇబ్బంది అవుతుందనే యోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు పోటీల ప్రారంభ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొంటారని డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

జిల్లా నుంచి 422మంది

సీఎం కప్‌లో భాగంగా దశల వారీగా నిర్వహిస్తున్న పోటీలు రాష్ట్ర స్థాయికి చేరాయి. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలనే భావనతో ప్రభుత్వం కొన్నేళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది 24 క్రీడాంశాల్లో జిల్లా నుంచి 422 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వివిధ జిల్లాల్లో జరగనున్న పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు తరలివెళ్లగా.. ఖమ్మంలో మొదలవుతున్న వాలీబాల్ టోర్నీకి రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు ఇక్కడకు రానున్నారు.

పసందైన భోజనం

వాలీబాల్ టోర్నీకి రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు రానున్నారు. వీరికి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులు వసతి సౌకర్యం కల్పిస్తుండడంతో పాటు ప్రతిరోజు భిన్నంగా ఉండాలనే ఉద్దేశంతో భోజన మెనూ సిద్ధం చేశారు. ఇందుకోసం ఒక్కో క్రీడాకారుడికి డైట్ చార్జీగా రూ.300 కేటాయించినట్లు తెలిసింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు పోటీలు జరగనుండగా ప్రతీ రోజు ఉదయం ఒక్కో రకం టిఫిన్, ఉడకబెట్టిన కోడిగుడ్డు, అరటిపండుతో పాటు పాలు లేదా టీ సమకూరుస్తారు. ఇక మధ్యాహ్నం మూడుకు పైగా కూరలు, సాంబార్, పెరుగు, సాయంత్రం స్నాక్స్ కాక రాత్రివేళ మూడు రోజుల పాటు చికెన్ సహా పలు రకాల కూరలతో భోజన మెనూ రూపొందించారు.



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి



పటేల్ స్టేడియంలో సిద్ధమైన వాలీబాల్ కోర్టు

క్లుప్తంగా

ఖమ్మం మార్కెట్‌లోకి బజాజ్ ఎలక్ట్రికల్ ఆటో



ఎలక్ట్రికల్ ఆటోను విడుదల చేస్తున్న బాబ్జీ, రాజేంద్రప్రసాద్

ఖమ్మంఅర్బన్: బజాజ్ సంస్థ రూపొందించిన ఎలక్ట్రికల్ ఆటోలను గురువారం ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ ఆటోమొబైల్స్ షోరూంలో బజాజ్ కంపెనీ డివిజన్ ఆర్‌ఎం బాబ్జీ, వీవీసీ, వీవీఆర్ గ్రూప్స్ ఎండీ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ గురువారం ఆటోలను ఆవిష్కరించి మాట్లాడారు. బజాజ్ ఆటో ఇప్పటికే మార్కెట్‌లోకి దూసుకెళ్తుండగా ఎలక్ట్రికల్ ఆటోలను తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్యాసింజర్, కమర్షియల్ విభాగాల్లో ఈ ఆటోలు లభిస్తాయని, ఒకసారి చార్జ్‌తో సుమారు 200 కి.మీ. మైలేజీ వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో వీవీసీ గ్రూప్స్ చైర్మన్ ద్రౌవపతి, వెంకటరమణ ఆటోమొబైల్స్ డైరెక్టర్ వీరేన్‌చౌదరి పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ పోటీల్లో కాంస్య పతకం



పతకంతో నారాయణదాసు

కల్లూరు: ఢిల్లీలో జరుగుతున్న 67వ జాతీయ షూటింగ్ పోటీల్లో కల్లూరు అంబేద్కర్ నగర్‌కు పోలీసు అధికారి దామాల నారాయణదాసు కాంస్య పతకం సాధించారు. 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ పురుషుల విభాగంలో ఆయన పతకం అందుకున్నారు. కాగా, నారాయణదాసు ప్రస్తుతం డీఎస్పీ హోదాలో మంచిర్యాల బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించడంపై కల్లూరు వాసులు అభినందించారు.

ఉపాధ్యాయులకు ఓడీ సౌకర్యం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నల్లగొండలో జరగనున్నాయి. ఈ మేరకు ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆన్ డ్యూటీ(ఓడీ) సౌకర్యం కల్పించిందని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు బొమ్మ కాలేజీలో మెగా జాబ్‌మేళా

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని బొమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజీ చైర్మన్, వైస్ చైర్మన్లు బొమ్మ రాజేశ్వరరావు, సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో 16కంపెనీల బాధ్యులు పాల్గొని ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఈమేరకు 2020 నుండి ఇప్పటివరకు బీటెక్, బీ ఫార్మసీ, ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు అర్హత పత్రాల జిరాక్స్, రెండు ఫొటోలతో హాజరుకావాలని, ఎంట్రీ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని వారు వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లి కాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.3,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరులో బుధవారం రాత్రి మద్యం మత్తులో యువకులు ఘర్షణ పడగా ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని అమర్లపూడి అరుణ్‌గాంధీ, తరుణ్‌పై అదే గ్రామానికి చెందిన మొల క్రాంతి, బద్దెల గణేష్ బీరు సీసాలతో దాడి చేశారు. ఈమేరకు గాయపడిన అరుణ్, తరుణ్ ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మట్టి లారీ సీజ్ ?

ములకలపల్లి: అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని అటవీ శాఖ అధికారులు సీజ్ చేసినట్లు విస్తృత ప్రచారం జరిగింది. ములకలపల్లి మండల పరిధిలోని మాధారం అటవీ ప్రాంతంలో యథేచ్ఛగా మట్టి దందా సాగుతోందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఈ క్రమంలో లారీని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై ములకలపల్లి ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్‌ను వివరణ కోరగా.. తమ పరిధిలో ఎలాంటి ఘటన చోటుచేసుకోలేదని చెప్పారు. పాల్వంచ ఎఫ్‌ఆర్‌ఓ సతీష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

ఏపీజీవీబీ.. ఇక టీజీబీ

ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా పేరు

- వచ్చేనెల 1వ తేదీ నుంచి మనుగడలోకి..
- మార్పులు, చేర్పుల కోసం నాలుగు రోజులపాటు సేవలకు బ్రేక్
- ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 95 బ్రాంచ్‌లు



సత్తుపల్లిలోని ఏపీజీవీబీ బ్యాంక్

సత్తుపల్లిటౌన్/నేలకొండపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్(ఏపీజీవీబీ).. ఇక తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టీజీబీ)గా మారనుంది. రాష్ట్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఏపీజీవీబీ బ్యాంక్ శాఖలన్నీ విలీనం కానున్నాయి. ఈమేరకు బ్యాంకు వర్గాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. కాగా, వచ్చేనెల 1వ తేదీ నుంచి టీజీబీ సేవలు అందుబాటులోకి రానుండగా, విలీన ప్రక్రియలో భాగంగా ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఏపీజీవీబీ బ్యాంకింగ్ సేవలు నిలిపివేయనున్నారు.

పాత ఏటీఎంలు పనిచేయవు

బ్యాంకు పేరు మారినా ఖాతాదారుల నంబర్లు మారవు. అయితే, యూపీఐ సేవల కోసం కొత్తగా టీజీబీ పేరిట రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, పాత ఏటీఎం కార్డుల స్థానంలో కొత్తవి తీసుకోవాలి. అంతేకాక టీజీబీ మొబైల్ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

నాలుగు రోజుల పాటు అంతరాయం

ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఏపీజీవీబీ బ్యాంక్ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. విలీన ప్రక్రియలో భాగంగా అంతర్గతంగా చేయాల్సిన పనులు కారణంగా ఈ పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. ఈ మేరకు ఖాతాదారులు శుక్రవారంలోగా బ్యాంకింగ్ అవసరాలను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా, ఏపీజీవీబీకి ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 53, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 42 బ్రాంచ్‌లు ఉన్నాయి. గతంలో బ్యాంకు ప్రధాన కార్యాలయం వరంగల్‌లో ఉండగా.. ఇప్పుడు టీజీబీ ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. అంతేకాక రాష్ట్రంలో కొన్ని జిల్లాలకే పరిమితమైన ఏపీజీవీబీ బ్యాంకు సేవలు ఈ విలీన ప్రక్రియతో అన్ని జిల్లాలకు విస్తరించనున్నాయి.



విలీనం అంశంపై ఏర్పాటు చేసిన పోస్టర్

మరింత విస్తృతంగా సేవలు



తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడిన తర్వాత మరింత విస్తృత సేవలు అందుబాటులోకి రానున్నాయి. విలీన ప్రక్రియ కారణంగా ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బ్యాంక్ సేవలు అందుబాటులో ఉండవు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి బ్యాంకు ఉద్యోగులకు సహకరించాలి.

– ఎం.ఉదయ్, ఏపీజీవీబీ, కొత్తగూడెం రీజినల్ మేనేజర్

ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించడమే కాక ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్న హామీని ఇకనైనా నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు జాతా గురువారం ఖమ్మం చేరుకుంది. ఈసందర్భంగా మంచికంటి హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత అంశంపై స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఈనేపథ్యాన ఈనెల 15నుంచి రాష్ట్రవ్యాప్త బస్సు జాతా నిర్వహిస్తున్నట్లు తమ్మినేని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుజె.మంగమ్మ, బి.అమలతో పాటు పి.రమ్య, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణానికి అడ్డంకులు ఏమిటి?

- మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్స్‌పై ఆరా
- మూడు శాఖల సంయుక్త ఆధ్వర్యాన పరిశీలన



మున్నేటికి ఓ పక్క కొనసాగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణం



సర్వేలో పాల్గొన్న అధికారులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలను మున్నేటి వరద నుంచి రక్షించేందుకు రిటైనింగ్ వాల్స్(కరకట్ట) నిర్మిస్తుండగా పనుల్లో అధికారులు వేగం పెంచారు. ఎలాంటి భూసేకరణ అవసరం లేని, అడ్డంకులు లేని ప్రాంతాల్లో వాల్ నిర్మాణం పనులు మొదలుపెట్టారు. మిగిలిన ప్రాంతాల్లోనూ నిర్మాణానికి ఉన్న అడ్డంకులను గుర్తించేందుకు మూడు ప్రధాన శాఖల అధికారులు గురువారం పరిశీలన(వాక్‌వే సర్వే) చేపట్టారు. మున్నేటికి ఇరువైపులా వాల్ నిర్మాణం చేపడితే రోడ్లు, తాగు నీటి పైపులైన్లు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, చెక్ డ్యాంలకు ఎంత మేర నష్టం జరుగుతుంది, వాటికి ప్రత్యామ్నాయంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే కోణంలో ఈ పరిశీలన కొనసాగింది. ఇందులో జలవనరులశాఖ ఎస్‌ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, డీఈ రమేష్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు రంజిత్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీకృష్ణతోపాటు, డీఈలు, ఏఈలు కరుణగిరి నుండి మున్నేరు వైపు సాగర్ ప్రధాన కాల్వ వరకు, సాగర్ ప్రధాన కాల్వ నుండి ఎఫ్‌సీఐ గోదాంల వరకు సర్వే చేపట్టారు.

ఇప్పటికే ఎంజాయిమెంట్ సర్వే పూర్తి

మున్నేటికి ఇరువైపులా రూ.690 కోట్ల అంచనాలతో నిర్మాణం ప్రారంభించిన రిటైనింగ్ వాల్స్ పనుల కోసం జలవనరు లశాఖ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా గతంలోనే ఎంజాయిమెంట్ సర్వే చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పట్టా భూములు ఎంత మేర సేకరించాలి, ఎన్ని నిర్మాణాలు అడ్డుగా ఉన్నాయి, వ్యవసాయ భూములు, ఖాళీ ప్లాట్లు ఎన్ని అన్న అంశంపై నివేదికను భూసేకరణ అధికారులకు అప్పగించినట్లు తెలిసింది. ఖమ్మం రూరల్ మండలంలో ప్రభుత్వ భూమి 70 ఎకరాలు, ఖమ్మం అర్బన్ పరిధిలో తొమ్మిది ఎకరాల మేర సేకరించాలని గుర్తించినట్లు తెలిసింది. ఇక ప్రైవేట్ పట్టా భూములు రూరల్ పరిధిలో 68 ఎకరాలు, ఖమ్మం అర్బన్ పరిధిలో వంద ఎకరాలు వరకు మొత్తంగా అంతా కలిపి 200ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, పది పైగా భవనాలు ఉన్న స్థలాన్ని కూడా సేకరించాల్సి ఉంటుందని నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం.

నేడు మంత్రి పొంగులేటి సమీక్ష

ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల్లో మున్నేటికి ఇరువైపులా సుమారు 20 కి.మీ. మేర కరకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఇటీవల రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో ఇంజనీర్లతో సమీక్షించారు. ఇదే అంశంపై మరోమారు జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా భూసేకరణ, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు కలిగే నష్టం, వాటికి ఎంత పరిహారం చెల్లించాలనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అంతేకాక ఇప్పటికే కొనసాగుతున్న నిర్మాణ పనులను సైతం మంత్రి పరిశీలించే అవకాశముం.

డైట్‌కు మహర్దశ

- రూ.8.62కోట్లతో లైబ్రరీ, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి తుమ్మల



ఖమ్మం టేకులపల్లిలోని డైట్ కళాశాల

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని డైట్ కళాశాల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఈఓ)కు అప్‌గ్రేడ్ కావడంతో మహర్దశ పట్టినట్లయింది. ఏడాది క్రితం సీఈఓగా అప్‌గ్రేడ్ కాగా, కళాశాలలో అవసరమైన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. దీంతో చేపట్టే నిర్మాణంతో విద్యార్థులకు డిజిటల్ ల్యాబ్‌లతో పాటు సెమినార్ హాళ్లు, లైబ్రరీ భవనాలు సమకూరనున్నాయి. రాష్ట్రంలో రెండు కళాశాలలకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హోదా ఇవ్వగా జాబితాలో ఖమ్మం డైట్‌కు కూడా స్థానం దక్కిన విషయం విదితమే.

కొత్త కోర్సులతో..

ప్రస్తుతం డైట్‌లో డీఈడీ కోర్సు మాత్రమే నిర్వహిస్తుండగా... సీఈఓగా అప్‌గ్రేడ్ కావడంతో డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఈ) కోర్సు మొదలుకానుంది. దీని ఆధారంగా అంగన్‌వాడీ పిల్లలు, ఎల్‌కేజీ పిల్లలకు బోధించేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నారు. వీటితో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకు సైతం శిక్షణ ఇస్తారు. కాగా, డైట్‌కు తాజాగా రూ.8.62 కోట్ల నిధులు మంజూరు చేయగా అదనపు తరగతి గదులుతో పాటు ఒక్కో లైబ్రరీ రూమ్, కంప్యూటర్ ల్యాబ్, రెండు సెమినార్ హాళ్లు, స్పెషల్ ఎడ్యుకేషన్ యూనిట్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ నిర్మాణం చేపడుతారు. అంతేకాక ప్రస్తుతం ఉన్న ప్రహరీ మరమ్మతులు చేయించి తాగునీరు, పార్కింగ్, క్యాంటీన్ సౌకర్యాలు సమకూరుస్తారు. కాగా, ఈ నిధుల మంజూరుకు కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పనులకు శంకుస్థాపన చేయనున్నారని డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ వెల్లడించారు.

ఇదీ డైట్ ప్రస్థానం

జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్) పేరుతో ఖమ్మంలో 1990–91లో ఏర్పాటైంది. అప్పుడు టీటీసీగా ఏడాది కాల వ్యవధితో 150 సీట్లు ఉండేవి. ఈక్రమాన ఖమ్మం సమీపంలోని టేకులపల్లిలో 1991లో భవనాలు నిర్మించారు. ఆపై 1990లో డైట్ గా పేరు మార్చారు. ఇక 2000 సంవత్సరంలో రెండేళ్ల కాల వ్యవధితో డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్ కోర్సు(డీఈడీ) మొదలైంది. అనంతరం 2014–15లో డీఈడీ కాస్త డీఈఎల్ఎడ్(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కోర్సుగా మారింది.

రేపు ఎన్‌డీ పార్టీల విలీన సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఒకే అజెండా, సిద్ధాంత రాజకీయంతో కొనసాగుతున్న రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీనం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు పోస్టర్లను గురువారం ఖమ్మంలో ఖమ్మంలో ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌డీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు పార్టీల విలీనంతో దేశంలోనే బలమైన విప్లవ పార్టీగా అవతరించబోతుందని తెలిపారు. ఈ మేరకు జిల్లా నుంచి సదస్సుకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు కోలా లక్ష్మీనారాయణ, వీ.వీ.రావు, మోహన్‌రావు, సుభాన్, సురేష్, జానకి, మురళి, పటేల్, షబ్బీర్, మస్తాన్, వెంకటేశ్వర్లు, బేతంపూడి నాగరాజు పాల్గొన్నారు.

జేబుదొంగల హల్‌చల్

వైరా బస్టాండ్‌లో ముగ్గురి నుంచి రూ.60వేలకు పైగా నగదు, ఆభరణాలు చోరీ



నిందితులు కట్ చేసిన బ్యాగ్‌లను చూపిస్తున్న బాధితులు

వైరా: వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం జేబుదొంగలు హల్‌చల్ సృష్టించారు. బస్సు ఎక్కుతున్న ముగ్గురు ప్రయాణికుల వద్ద నుంచి రూ.60వేల నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.కొణిజర్ల మండలం రామచంద్రాపురానికి చెందిన అడపా రంగనాయకులు వైరా ఎస్‌బీఐలో నగదు విత్ డ్రా చేసుకుని ఖమ్మం వైపు వెళ్లే బస్సు ఎక్కుతుండగా ఆయన చేతిలోని సంచిని గుర్తు తెలియని వ్యక్తులు బ్లేడ్‌తో కట్ చేసి అందులో ఉన్న రూ.54వేలు నగదు అపహరించారు. ఇదే సమయాన వైరా మండలం గండగలపాడుకు చెందిన ఇద్దరు మహిళలు జగ్గయ్యపేట బస్సు ఎక్కుతుండగా వారి వద్ద ప్లాస్టిక్ సంచుల్లో నుంచి రూ.8 వేల నగదు, బంగారు ఆభరణాలు సైతం తస్కరించారు. బస్సులో ఎక్కాక ఈ విషయాన్ని గమనించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వైరా సీఐ సాగర్, ఎస్‌ఐ భాగ్యరాజు వంశీ చేరుకుని తనిఖీలు చేపట్టిన ఫలితం కానరాలేదు. జేబుదొంగలు ప్రయాణికుల మాదిరిగా రద్దీ బస్సుల వద్ద చోరీలకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

నిరుపయోగంగా సీసీ కెమెరాలు

ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అవి కొన్నాళ్లుగా పనిచేయడం లేదు. అయినా మరమ్మతులపై ఎవరూ దృష్టి సారించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. సీసీ కెమెరాలు ఉంటే పుటేజీల ద్వారా చోరీలకు పాల్పడిన నిందితులను గుర్తించే అవకాశముండేదని పలువురు పేర్కొన్నారు.

రూ.3కోట్ల అప్పులు.. ఆపై మాయం

అధిక వడ్డీ ఆశతో మోసపోయిన జనం

నేలకొండపల్లి: ఎక్కడ నుండో వచ్చిన వ్యక్తి సుతారీ మేస్త్రిగా ప్రస్థానం ప్రారంభించి రకరకాల వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ చేస్తూ అందరినీ నమ్మించాడు. ఆపై అధిక వడ్డీ ఆశతో జనాన్ని ఆకట్టుకోగా అంతా కలిసి రూ.3కోట్ల మేర అప్పులు ఇచ్చారు. తీరా ఇప్పుడు కానరాకుండా పోవడంతో అప్పులు ఇచ్చిన వారంతా లబోదిబోమంటున్నారు. నాలుగేళ్ల క్రితం ఏపీలోని అనంతపురం వాసిగా చెప్పుకున్న ఓ వ్యక్తి నేలకొండపల్లికి ఒంటరిగా వచ్చాడు. తొలుత సుతారీ పనిచేసిన ఆయన ఓ భవన నిర్మాణంలో పాలుపంచుకున్నాడు. అందరితో కలివిడిగా ఉంట పరిచయాలు పెంచుకుని అప్పులు తీసుకోవడం, ఎక్కువ వడ్డీతో చెల్లించడంతో అంతా ఆయనను నమ్మారు. ఆపై తన పనుల్లో పాలుపంచుకున్న భవనంలోనే మూడు గదులు అద్దెకు తీసుకుని వ్యాపారాలు ప్రారంభించాడు. అందులో స్థానికులనూ భాగస్వామ్యం చేసుకున్నాడు. అంతేకాక రెండు కార్లు కొనుగోలు చేసి తిరుగుతుండడంతో అంతా నమ్మసాగారు. పలువురు సొంత డబ్బు అప్పుగా ఇవ్వడమే కాక బంధువుల నుంచీ ఇప్పించారు. ఆపై సదరు వ్యక్తి రియల్ ఎస్టేట్ రంగంలోకి వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మిస్తున్నట్లుగా ప్రచారం చేశాడు. ఆయన మరింత నమ్మకం పెంచుకున్న ఖమ్మం, నేలకొండపల్లి, రామచంద్రాపురం, బోదులబండ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు రూ.3 కోట్ల మేర అప్పులు ఇవ్వగా సదరు వ్యక్తి వారం రోజులుగా ముఖం చాటేశాడు. ఫోన్ కూడా పని చేయకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన స్థానికులు సదరు వ్యక్తి ఇచ్చిన ఆధార్ కార్డు నంబర్ ఆధారంగా పరిశీలిస్తే చిరునామా బెంగళూరుగా తేలింది. దీంతో బాధితులు 30మందికి పైగా గురువారం మండల కేంద్రంలో ఓ పార్టీ నాయకులను ఆశ్రయించారు. ఇంకా చాలా మందే ఆయనకు అప్పులు ఇచ్చినా బయటకు రావడం లేదని తెలిసింది. కాగా, తమకు జరిగిన మోసంపై అంతా కలిసి పోలీసులను ఆశ్రయించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

డబుల్ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక పరిధిలో ఒకరికి అమ్మిన భూమిని, తప్పుడు పత్రాలతో ఇంకొకరికి అమ్మి రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్ల రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. 2019లో అమరనేని రామకృష్ణకు 28 కుంటల భూమిని బిక్షం, కిషన్, ద్వాలీ అమ్మి రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఆతర్వాత బిక్షం మరొకరి పేరుతో ధరణిలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుసుకున్న రామకృష్ణ ఫిర్యాదు చేయగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మైనర్ బాలిక అదృశ్యంపై...

మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఇంటి నుండి బుధవారం వెళ్లిన కుమార్తె కోసం ఎక్కడా గాలించినా ఆచూకీ లేకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లైంగిక వేధింపులపై..

వేంసూరు: ఒంటరిగా ఉన్న మహిళపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు. మండలంలోని జయలక్ష్మీపురానికి చెందిన మహిళ ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన బల్లెపోగు నాగరాజు లైంగిక దాడికి యత్నించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో కేసు గురువారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



గోళ్లముడి కేశవ్ (ఫైల్)

ముదిగొండ: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... మండలంలోని ముత్తారానికి చెందిన గోళ్లముడి కేశవ్(21) ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 24న చింతకాని గ్రామంలో క్రిస్మస్ జరుపుకునేందుకు ఆయన తల్లి మరియమ్మ, సోదరి స్వప్న వెళ్లారు. పండుగకు కేశవ్‌ను కూడా రావాలని సూచించగా ఆయన ముత్తారం వెళ్తానని చెప్పాడు. ఈక్రమాన బుధవారం ఆస్పత్రికి వెళ్లొచ్చిన ఆయన గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించాడు. ఈ విషయమై గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో తల్లి, సోదరి చేరుకుని కేశవ్ ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు.

సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం వద్ద తాచుపాము!



ఆలయంలో పడగ విప్పిన పాము

ముదిగొండ: ముదిగొండలో వందేళ్ల చరిత్ర కలిగిన చెన్నకేశవస్వామి, లక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో గురువారం పది అడుగుల తాచు పాము కనిపించింది. మధ్యాహ్న సమయంలో ఆలయం ముందు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద పడగ విప్పి ఉన్న తాచుపామును స్థానికులు గుర్తించారు. అయితే, ఆ పాము కాసేపు అక్కడే ఉండి వెళ్లిపోయింది. కాగా, విగ్రహం వద్దకు పాము తరచుగా వచ్చివెళ్తుందే తప్ప ఎవరికీ హానీ చేయడం లేదని అర్చకులు రొంపిచర్ల నరసింహాచార్యులు, యగ్నేష్ ఆచార్యులు తెలిపారు.